# నీడలు

## నరేష్ నున్నా

**ఎంత** బలంగా వీస్తుంది చీకటి...
తెల్లటి చలి
........ఎంత కురుస్తున్నా కన్పించి చావదేం..... చంపుతూ కన్పిస్తుందే గానీ...
'వడదెబ్బకు వందమంది రా.....' అసంబద్ధమైన వార్త చదవబుద్ది.....
గట్టిగా రగ్గు కౌగిలింతలు....
......కౌగిలింతలు...... ఎదురింటి శ్యామల.......

'......శ్యామూ! కాలనీ వీనస్!! నీ ఒంపుల మెలికల్లో ఇరుక్కొని ఊపిరాడక చస్తూ.....' ఛస్ నోర్మూయ్ వెధవ సిలింద్రికల్ శ్యామల గుండ్రని పారవశ్యపు మెలికల్లు....

పొగడ్తల అగడ్తలలో........ పాపం!

ఈ రోజు ధైర్యం చేస్తే...... ఓ అనుభవం కొత్తగా.

బహుశా తనకూ్కడా.....

దూకేస్తే బాల్కనీలోంచి.....

అరుస్తుందా? 'కెవ్వు' న....

'కెవ్వు' మనే ఎందుకనాలి? 'భౌవ్వ' ని అనకూడదా.......

ఎవడు కనిపెట్టాడో భాష..... పదాలు....... గల గల...... బిల బిల....... కిల కిల..... ఊహూ.... హూ. .. పోనిద్దూ ఎవడో ఒకడు..... చ్ప....లి.....గా......లి....

.....ఎముకలు కొరికే.....

కాదు నేనలా అనుకోను..... చర్మం రక్కే లేదా తోలును చీరే లేదా...... ఛ వెధవ గొడవ.....

'మా దుబాయి బాబాయి తెచ్చాడండీ దీన్ని..... చలి దీని దరిదాపులకే.....' గుండ్రని ఒళ్ళు చక్రాల్లాంటి కళ్ళు.....



...... శ్యామలా నీ సన్నజాజులు రగిల్చిన మంటల్లో కమిలి కాగి....

.....ఎర్రగా చూస్తూతూ నాలోంచి......

ఎర్రగా చూస్తూ నాలోకి బెడ్‌లాంప్.... ఎర్రదీపం.... ఎక్కడ 'మెదడు' లోనా?

'.....నీశాకేశాల మధ్య స్త్రీ జననాంగం లా......'

..... ఆ! ఎవరు గుద్దురిమిన చప్పుడు.

బీభత్సాల ఖడ్గమృగం వడివడిగా వెళ్ళిపోతున్న ధ్వని.....

నువ్వా కృష్ణ! సారీ.... ప్లీజ్....

ఎగిరొచ్చిన నీ జ్ఞాపకాన్ని చూసేనేమో కీచురాయి ఏడుప్పాట ఆపి మౌనంగా.... ఆసక్తిగా.... కృష్ణజ వనేనా?

పాపపుణ్యాల తర్జనలో నా తోకవంకరని సరి చేసుకోనివ్వు.

అస్తవ్యస్త స్వప్న శకాలాలన్నీ కూడబలుక్కొని నిల్చిన సామూహికాకృతి నీ ప్రతిబింబమయ్యి.... నల్లని రాత్రిని వెల్గించి, ఝాములు కరిగించి....

....కనీసం పునాదులైనా కన్పించందే ఇంటినెలా ఊహించుకోమంటావ్ మై యంగ్ అనెంప్లాయిడ్ గ్రాడ్యుయేట్ ప్రేమికా......

రామ్మూర్తి వ్యంగ్యం.... 'గారు' అనాలేమో...... కాబోయే మామ కాదు మామగారు. ఇంకా కర్టెన్ చాటు చెవులు. బేలకళ్ళేనా? పాత మురికి వాసనల డాడీల నొదిలి పంజరబంధనాల్ని విడిచి రా డియర్ పోదాం మన అవిభాజ్య అస్తిత్వాల శరద్రాగపు రమ్యావరణానికి....

హృదయ అక్షయ గుండిగల్లో అనంతమైన ప్రేమ ఎన్ని యుగాలు తిన్నా తరగదు గాక తరగ...

'నా టాలెంట్‌ను సరిగా ఉపయోగించుకోలేక....'

సర్లేవో కోతలు.....

తప్పుదు డిఫెన్స్.....

వాస్తవం.... వేపకాయ చేదు గుళికల వాస్తవం....

ఆకలి తోరణాలు వేలాడే ఏ ఆవరణలోనైనా ప్రేమలు ఇగిరిన మాడు వాసనే....

'ఆకలి... ఆకలి... అగ్ని శైలగర్భంలో పొంగిన లావా వాహిని....'

బైరాగీ! పాడుచుకొచ్చిన పంజరపు పక్కటెముకల సోమాలియా బ్రతుకుగీతలెంత గజిబిజిగా...

అపశృతెక్కడో దొర్లింది....

ఆలోచనలే కళ్ళు తెరవక ముందే మొదలయ్యిందా?

అమ్మ నాన్నా??!!

నా పాదాలు కందిపోతాయుని అరిచేతులు పరిచిన నాన్నా! నిజంగా.... న్నిర్ఘుంగానే అబద్ధం.... తెలియక దొర్లిన అపశృతి మొదలుకొస తెలుసని భ్రమపడటం... ఎంత అబద్ధం.... ప్రిపరేషన్ హాలీడేస్‌లో నా ఒంటరి రూమ్ కవిత్వం వాసనేసిందని బెంబేలుపడ్డ నీతో కాదు మున్నాతో... 'మన ముందుందొక శ్మశానం... ఎల్లెడలా కపాలాలు పగిలిపోతూ....' అంటున్నాడు 'మో'....

అవునుగానీ నాన్నా! నువ్విచ్చే తల నీలాలకి ఆశపడేనా నన్నా పరీక్షల వంతెన్ని దాటించింది వాడు.... . ".... కఠిన తపస్యలు బలిసమర్పణలు..... నెత్తుటి పూజలు.... వెర్రిప్రార్థనలు......ఈ రాక్షస విగ్రహం ముందునా?"...... వెర్రినాన్నా....

'....ఏడు కొండలవాడా ఎక్కడున్నావయ్యా...... ఎన్ని మెట్లెక్కినా.......' భక్తోన్మాదం.....

పాపం ఆదిశంకరా....... అహంబ్రహ్మస్మి(ట).

అద్వైతం!!??

'....... చింతలపూడి వెంకటనర్సయ్య గారి మనవడు మంకెనపూడి వీర్రాజుగారి రెండవభార్య ముక్తమాంబాదేవి గారి మూడో అల్లుడు భక్తవత్సల జంబుకేశ్వర్రావ్ గారు స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన నిమిత్తం సమర్పించినది ఐదురూపాయలు.... వారికి స్వామివారు.... అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు......'

'సాయిదేవుని మహత్యములను కరపత్రాలుగా పంచిచ్చిన రిక్షారంగన్నకు వారం రోజుల్లో లక్షరూపాయల లాటరీ......'

స్పిరిచ్యువల్ కరెప్షన్.....

కరెప్షన్....... లంచం.....

.....ఎంత ఓస్ యాభైవేలు (.....లేనా?.....)

'.......ఎంతదీ సంవత్సరం తిరిగే లోపల సంపాదించలేడా..... ఆ సీటుంది చూసారూ.... పై సంపాదన బాగా.....'

సంపాదన అబ్బాయి జాతకంలోనే ఉంది...... అరచేతి గీతల్లో బలిసిన జెర్రెగొడ్డు ధనరేఖ మెలికల్మెలికలు.....

చెప్పనే లేదు లాభం నెంబర్ టూ.....

కట్నం....

'.... ఈ రోజుల్లో ప్యూనుకిస్తున్నారు యాభై అర్వైవేలు....'

మొదటి పెళ్ళి చూపులు.... మంగళగిరి....

స్వీట్స్‌మిటి కాజాల? లేమో..... బాగున్నాయి

పేరు పార్వ...... కాదు పద్మావతి.....

'..... ఎలా ఉందిరా అమ్మాయి.....' నాన్న.

నా చదువు అప్పు..... చెల్లి పెళ్ళి....

సమస్య పాతదే... బాగా....

బహుశా నిత్య నూతనంగా......

స్విచ్ వెయ్యి... 'బాగుంది....'

'ఎంత ఉద్యోగం లేకపోతే మాత్రం.... ఇవాళ కాకుంటే రేపు... బోడి ఇర్వైవేలు'......

స్విచ్ తీసెయ్యి.... చెరిపెయ్ ఏ కాస్త ఇంప్రెషన్ గుర్తైనా....

గ్రౌట్‌చైనా వాల్‌లా మధ్యన నోట్లు కుట్టిన ఇటుకల ప్రహరీ.....

.... ప్రహరీ పెద్ద ఎత్తేముంది? దూకి.... మెల్లగా....

బాబోయ్ 'భౌ భౌ'.... కుక్క

పాలిష్ పెట్టిన పదును కోరలు....

'.... క్షమించండి కుక్కగారూ చిన్న ప్రాబ్లెమ్.....'

అరె! వినదేం ఖర్మ.....

'......టామీ డియర్ కమ్..... కమియర్....'

వెయ్యి కాదు కోటి వీణల గొంతు సవరింపు.....

బుద్ధిలేని గాలి..... క్లిప్స్ పెట్టినా బాల్కనీలోంచి జారి....

ష్! ఒకే ఒక్క అండర్‌వేర్.... ఎలా చెప్పాలి....

'...... ఎవరు కావాలండీ....' సారుగీలా? సితారులా?

'..... హి.హి.హి..... వెర్రినవ్వు....'

ఎవరు కావాలన్నా గోడదూకట మనవసరమేగా....

'....... పక్కింటి టాప్ పోర్షన్‌లో నేనండీ మేముండేది.....'

అసంబద్ధమైన సమాధానం విని.... 'నే చెప్పలా దొంగోడు....'

కుక్క భాషల 'భౌ భౌ' లో బొచ్చుటామీ గుర్రుగా....

కొందరు కేవలం ప్రేమించబడటానికే పుట్టినట్లు....

.... సముద్రపు కలల నురగల నునుపుల కృష్ణకూడా...

ప్రేమా? ఓరేయ్ ఈడియట్లూ అక్కడ ఊళ్ళో ఇర్వైఏదేళ్ల నుండీ ఇంతై ఇంతింతై పెరుగుతున్న బాధ్యతలు.... నో....నో.....

నో ఇంట్రప్షన్ ఆఫ్ బుద్ది ప్లీజ్....

'బుద్దీ' మాటను 'బుద్ది' గా వినవేం మనసా?......

చిక్కు వీడని ప్రశ్న... విద్యుత్ ఉచ్చుల ప్రశ్న......

ఆలోచనకీ ఆచరణకీ మధ్య ఉన్న అగాధమంతటి ప్రశ్న......

'... Between Idea and reality.....'

రియాలిటి వాస్తవికతా భూతల

వాస్తవాల కొలిమిలో వ్యక్తిత్వమో శలభం.... ఆశయమో శలభం....

.... దట్టని శూన్యాల ఆ బ్లాక్‌హోల్ రాక్షస విధ్వంసకాకర్షణకి అనివార్యంగా.....

'..... ఆకర్షణ. ఇంకా గరిగా చెప్పాలంటే మోజు.... లస్ట్... తగిలించకు దానికో ప్రేమలేబుల్...'

'...... అలా అనకండి అంకుల్ ....ఐయామ్ సిన్సియర్లీ.....'

రేయ్ మామా ఇన్సల్ట్ చేయకు..... ఏదైనా చూసే కళ్ళలో ఉంటుందిరా కమర్షియల్ వేధవా.... ఒకళ్ళకి 'మొగుడు పెళ్ళాం'..... మరోడికి అమ్మ...... నాన్న.....

అదే తేడా.....

అమ్మ..... పాపం నేనేదో చాలా గొప్పోడ్నవుతాననే భ్రాంతిమయ ప్రేమలో.... అమ్మా! ఏం చేస్తున్నావ్.....

అబ్బా పొలమారింది... తల్చుకున్నావా నన్ను?....

ఇదో పిచ్చి.... ఎందుకు ఏమిటి ప్రశ్నల కొక్కేలకి దొరకని పిచ్చి....

తల్చుకుంటేనే పొలమారితే రోజులో పొలమారని క్షణాన్ని పట్టడం ఎంత కష్టం!

మొదలు ఎవడు చెప్పి ఉంటాడో పొలమారుడు తలంపుల వ్యవహారం?..... ఎవడో.....

...మన ముత్తాతల ముత్తాతల...... తాత....

ఇక్కడ కూడా పులింగమేనా? పురుషాధిక్య భావజాలమని ఫెమినిస్టులు కరుస్తారేమో.... పోనీ మన ముత్తాతమ్మల ముత్తాతమ్మల తాతమ్మకే క్రెడిట్ ఇచ్చేస్తే.....


ఏదో రహస్యాన్ని దాచి దాయనట్లున్న బొడ్డు

వక్షస్థల పూర్వక ఆహ్వానాల లోనెక్ జాకెట్ల జారుడుపైటల కవ్వింపుల.... హైమావతి... పొడవెక్కువ.....

సింప్లీ హైమ.....

ఇంకా శైలజారాణి..... రమాదేవి.... గంగాభవానీ.... బాప్‌రే బాప్ ఫెమినిస్టులు..... లక్షల సంవత్సరాల పురుషాధిక్య కూకటివేళ్ళు పెళ్ళగించాలని.......(లనే?)

ఎక్స్‌పోజింగ్‌కే పరిమితం కాబడుతున్న స్త్రీలో సెక్స్‌ప్పీలింగ్ స్థానాల్ని బహిర్పరిచేందుకు డిజైన్ చేసిన చీర, బిగుతుజాకెట్..... వేషధారణల ఫండమెంటల్ నీచత్వాన్ని ప్రతిఘటించాలన్న స్పృహే లేని ఫెమినిస్టులు.....



'...... నేనని వేరే లేనేలేనని ఎలా తెలిపేది.... నీకెలా తెలిపేది?......' సుశీల గొంతు తీపి, ' నా కంటూ వేరే అస్తిత్వం లేదని స్త్రీ ద్వారా చెప్పిస్తున్న ఎవడో దురంహకార పురుషకవి' అంటూ ఇక్కడ మాత్రం తయారు....

కట్టేయండి రేడియోలు ష్! వినగలరు వాళ్ళు.....

'...... ఉమ్మాల్సిన ముఖాలమీద ముద్దులు పెడుతూ....! పవిత్ర ఓల్గా కవిత్వజలధిలో.... కాదు కవిత్వ వైతరణిలో....

...పాపం శమించు గాక...... అమంగళ మ్రప్రతిహతమగు గాక.....

వద్దు కృష్ణా! ఇక్కడొద్దు యంత్ర వాసనల మాయానగరపు సాలెగూట్లోంచి ఏమైదానాలకో ఎగిరిపోదామా?

'..... ఫార్ ఫ్రమ్ ది మాడింగ్ క్రౌడ్.....'

'ఇన్ స్టైల్'..... ఫాసినేటింగ్ మోడలింగ్ కపుల్ లానే......

...... అంత విశాలమైన (రమారమి నా హృదయు మంత) మైదానం ఎక్కడ దొరికిందోయ్ అమీర్.... 1928 లోనా?.....

ఇప్పుడది బహుశా ఏ స్లమ్మో..... కజ్జారాక్షసి పొదిగిన కాంక్రీట్ గుడ్డో.... ఎక్కడైనా సరే చెరో గ్లాసుడు ప్రేమ చాలదేమో కదా....

సాధించాలి.... అవును సాధించితీరాలి.......

కష్టం... కాదా మరి??

నీకు తెలియదు కృష్ణా..... సినిమాల్లోలా రిక్షాతొక్కి చెల్లి పెళ్ళి కట్నం లక్ష సంపాదించడం.... పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిగ్రీ టీ బడ్డీ టైటిల్‌గా పెట్టేయడం...

.....అంతా ట్రాష్.....

ఉద్యోగం లేకపోతే చదివిన చదువే పెద్ద గుదిబండ....

చక్కగా ఆదరించే ఈస్టబతకి పొరలుపొరలుగా చీలేయాలని....

నిర్ధారణలన్నీ చూపుడువేళ్ళు గురిపెట్టినప్పుడు తోసేయాలి నేరాన్ని ఎటువైపైనా....

'..... మన చేతిలో ఏమీలేదు, అంతా అక్కడే రాసిపెట్టి ఉంటుంది....'

అయితే పూర్వజన్మలో నేనేమై ఉంటాను. బాగా లంచాలు మేసి, కర్కోటక ప్రభుత్వ....

...కాదు కాదు ప్రభుత్వ కర్కోటక అధికారిక జలగనై.....

గత కర్మల పాపఫలం..... అర్జునా! ..... నీ వీపుమీద....

'..... వ్యక్తిగత సమస్యన్నదే లేదు అంతా సమాజం నుండి ఉత్పన్నమయ్యిందే....'

....అవును ఈ నీచ కాపిలిస్టిక్ వ్యవస్థ దేహానికి నిరుద్యోగ రాచకురుపునుండి కారిన రసి....

...అవును అంతే.... నా తప్పేముంది? ఏమీలేదు....

ఎంత రిలీఫ్....

'.....వ్యక్తి సంస్కరణ....'

విస్పోటనాలు.... విధ్వంసాలు కాకున్నా ఎక్కడో ప్రారంభ మవ్వాలి కదా...... వెలిగించు గోరంత... దీపం....

కదలకుండా ఉండలేక కిర్రుమన్న కిటికీరెక్క, నిశ్శబ్దాన్ని ఇంట్రప్ట్ చేసినట్లు, నా కోనేటి ప్రశాంతత లోకి రాయివిసరకు చలం! ఈ కాస్త మనశ్శాంతైనా మిగలనీ.... ఈ మూసల్లోనే మూల్గనీ....

లాగకు ఈ మూసల్లోంచి..... రాయ్! నీ టార్‌మెంటెడ్ సోల్ స్వేచ్ఛకోసం జరిపిన అన్వేషణ లో కూడా సూత్రాల శృంఖలాలేనా?

రెండవ సూత్రంలో స్వేచ్ఛ నాల్గో ప్రతిపాదనలో ఎగిరిపోయి, నీ హ్యూమనిజంలో నవ్యత ఇగిరిపోయి...

మనిషి దైవ బద్ధుడు.... ఇనుపపంజరం..... ఆర్థికబద్ధుడు.... వెండి పంజరం... ప్రకృతి బద్ధుడు... బంగారుపంజరం... ఇంతేనా?.....

......ఓహ్! పంజర స్వేచ్ఛ.... మనిషికి మనిషి పరంగానే నిర్వచించలేమా?.... సంకెళ్ళింకా తెగనే లేదు...

బ్రతికుంటే ఇంకేమనే వాడివో..... ఇంకే ముత్యాలు గుచ్చేవాడివో రాయిజం దారానికి..... 'మంచి ముత్యాలు ఉన్నాయట.... పెరెల్స్‌షో... రేపుండదు వెళ్దాంరా.....'

నీరెండలో మెరిసే ముత్యాల్ని రుమాల్లో ఎన్నిదాచావ్ కృష్ణా!

'..... బుక్‌ఫేర్ కూడా లాస్టే డియర్......'

ఓ నా ఎమరాల్డ్...... నీ త్యాగం.... (చిన్నదేనా?)

... మిల్స్ అండ్ బూన్ ప్రపంచాల కృష్ణా..... పదపోదాం.....

దారంతా నీ కళ్ళలో ఊహల్లో నిలిచివ హర్మ్యాలకి కనీసం రంగు తళుకులైనా అద్దలేక సతమతమయ్యి.... పుస్తక వల్మీకాల్లోకి పారిపోయి.....

న్యూవెర్వైల్స్........ 'కాగడా గా వెల్గిన క్షణం....'

ప్చ్! ఏ శివార్ల ఎన్‌కౌంటర్ ముసుగుల హత్యల్లో తేలి..... '......అమ్మా!' ఎదుర్దెబ్బ....

'....అరెరె... రక్తం....!

ఎర్రటి గాయంలానే అస్తమయ సూర్యుడు నెత్తురద్ది విసిరే సిన దూదెపింజల్లా మబ్బుతుంపులు అక్కడక్కడా..

నీళ్ళు.... నాకంట్లో.....

'సిల్లీ! ఏమిటీ ఇంత చిన్న దానికే....'

కృష్ణ.... నీకు తెలీదు.... ఏదో చేయకుండా నిల్వలేని తనాల ఆత్మత్యాగాలు.... ఒక్క ఎమ్.ఎస్.ఆర్. కాదు...వందలు... శిశితల్లో ఆకుల్లో....

నాలుగుగోడల భద్రతల్ని కప్పుకొని పడక్కుర్చీల్లో కాల్చిన కంగా నొప్పులు పడే మనకు తూర్పుగుండంలో ఆహుతయ్యే సమిధల గురించి తెలీనే తెలీదు.

'.......చీకటి నిబర్వణల తర్వాతనే కొత్త సృష్టి.....' అంటాడు ఆప్టిమిస్ట్ అజంతా.... ఏదో వెర్రినమ్మకం.... ఈ తొందర తొక్కి సలాటల్లో.... ఇరుకిరుకు బ్రతుకుబొరియల్లో మగ్గిపోతున్నా.... ఆప్టిమిజమే....

'.....దృశ్యం మారకుంటే ఖడ్గధారణ.... లేదా నిష్క్రమణ.....'

దృశ్యం మారుతుందనే ఆశ ఇప్పుడు మిణుకు మిణుకుగా.....

ఏదో అదృశ్య రాక్షస హస్తం ఇంజెక్ట్ చేస్తున్న చీకటి అందరి తలల్లోకి చొరబడుతుంది... నిష్క్రమణకైనా ఎంత ధైర్యం కావాలి....

వెలిగిస్తూ ఆశ.... దహిస్తూ ప్రశ్న.... ఇవేనా జీవితంలో.... చివరిదాకా తోడు?

'......విప్పుకుంటాను వాక్యతీరాల్లోకి..... మళ్ళీ ఈ మెట్టు దగ్గరే నా పురాతన దహనం.....! సిద్దార్థా! నీలోకి మమేకమై....

దహనమ్.... జ్వలనమ్..... అ.....న.....ల.....మ్.....

'.....అగ్గిపెట్టెక్కడుందిరా.....!'

నిద్రమత్తు...... ఇంకా తెల్లారలేదు.... సిగిరెట్!

'అగ్గిపెట్టెరా బాబూ.....'

వెదకలేదు గాడిద..... లేవక తప్పదు.....

'......రామూ నాకూ ఒక పీక....'

'ఉందాకటేరా.....పోనీ దీని పీక నులిమి ఫిఫ్టీ ఫిఫ్టీ.....'

జీవితం సిగిరెట్ లాంటిదా.... లేక సిగిరెట్ జీవితం లాంటిదా?.... ఏదో తెలీని తెల్లని మెలికల అన్వేషణ....నుసిను సిగా.....

....క్షణాలు..... యుగాలు....

దూరంగా కేకపెట్టి దౌడుతీస్తున్న రైలు.....

వణుకుతున్న ఇనుపవంతెన.....

.....ఎక్కడో అనివార్యంగా విడిపోయినట్లు పట్టాలు....

......సిగిరెట్ కాలుతోంది.....

●

## కథాభిమానులకు విజ్ఞప్తి

గురజాడతో మొదలైన ఆధునిక తెలుగు కథ తెలుగు జాతి జీవితాన్ని సమగ్రంగా చిత్రిస్తూ వచ్చింది. చింతా దీక్షితులు, శ్రీపాదీ, చలం, కొడవటిగంటి, గోపీచంద్, బుచ్చిబాబు, చా.సో. రావిశాస్త్రి మొదలైన సుప్రసిద్ధ కథకులెందరో తెలుగుకథను తీర్చిదిద్దారు. అయితే మరెందరో రచయితల మంచి కథలు సంపుటాల్లోను, సంకలనాల్లోను రాకుండా కేవలం పత్రికల పుటల మధ్యనే మరుగున పడిపోయాయి. ఇలాంటి మంచి కథలను సేకరించి కొన్ని సంకలనాలుగా ప్రచురించాలని భావిస్తున్నాం. కాబట్టి కథా రచయితలు, కథాభిమానులు 1910-1990ల మధ్య కాలంలో పత్రికలలో ప్రచురించబడి, కనుమరుగైన ఉత్తమకథల జిరాక్స్ కాపీలు, లేదా వాటి వివరాలు కింది చిరునామాకు పంపి సహకరించవలసినదిగా కోరుతున్నాం. ఇప్పటికే లభ్యమవుతున్న సుప్రసిద్ధ రచయితల కథలు సూచించనవసరం లేదు.

వల్లూరు శివప్రసాద్

పాపినేని శివశంకర్